జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 16-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 456 పేజీలు: 4 వెల : రూ.7


# హోటళ్లు.. రోగాలకు నిలయాలు!





* కనీస నిబంధనలు పాటించని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు * కుళ్లిన కూరగాయలు, చేపలు, మాంసంతో వంటలు * లొట్టలేసుకుని తింటున్న ఆహార ప్రియులు
* ప్రజారోగ్యం గాలికొదిలేసిన పలు హోటళ్ల నిర్వాహకులు
* వ్యాధుల బారిన జిల్లావాసులు * ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు
* కేఎఫ్‌సీలో ఆహార తనిఖీ అధికారుల ఆకస్మిక తనిఖీ
* బట్టబయలైన నాణ్యత





**శ్రీకాకుళం, సెప్టెంబర్ 15 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు.. వ్యాధులకు నిలయాలుగా మారాయి. నిర్వాహకులు కనీస నిబంధనలు, నాణ్యత పాటించడం లేదు. శుచి, శుభ్రత ఉండడం లేదు. వంటలు చేసే ప్రాంతం చూస్తే హోటళ్లలో ఇంకెప్పుడూ తినకూడదు అనిపిస్తుంది. మిగులు ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో ఉంచి ఆ తర్వాత రోజు మళ్లీ మళ్లీ వేడి చేసి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మూడు అంకెల సంఖ్యలోనే చిన్నా పెద్దా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. అడుగడుగుకో టిఫిన్ సెంటర్ దర్శనమిస్తోంది. హోటళ్లలో చేతులను శుభ్రం చేసుకోవడానికే తప్ప తాగేందుకు మినరల్ వాటర్‌ను అందుబాటులో ఉంచడం లేదు. హోటళ్లలో తినేవారు తప్పనిసరిగా వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. వంటల్లో వాడే నూనె నల్లగా మాడిపోయివుంటుంది. పాత్రలు, ప్లేట్లను వేడినీటిలో కడగాల్సివున్నా, ఏదో అలాఅలా సబ్బు నీళ్లలో కడిగేసి వాటినే వాడుతుంటారు. వాటిని చూస్తే టిఫిన్ తినబుద్ధి కాదు. కనీస శుభ్రత పాటించరు. ఆ ప్రదేశం కంపుకొడుతూ ఉంటాయి. ఇవన్నీ తెలియక ప్రజలు రోగాలు కొనితెచ్చుకుంటున్నారు.

## ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు..

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఆహార తనిఖీ అధికారుల జాడ కనిపించడం లేదు. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అసలు కార్యాలయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు. కనీసం నెలకోసారైనా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేస్తే వాటిలో ఎంతోకొంత మార్పు వచ్చేది. అసలు అటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం అలా వెళ్లి.. ఇలా వచ్చేస్తుంటారు.

## కేఎఫ్‌సీలో అధికారుల తనిఖీ..

నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఉన్న కేఎఫ్‌సీ ఫుడ్‌సెంటర్‌లో నాణ్యత పాటించడం లేదని కొందరు జిల్లా ఆహార నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీ అధికారి ఎస్.ఈశ్వరి సిబ్బందితో సోమవారం ఆకస్మాత్తుగా కేఎఫ్‌సీ ఫుడ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఫ్రిజ్‌లో కుళ్లిన కూరగాయాలు, పాడైన మసాలాలను చూసి అవాక్కయ్యారు. వాటిలో కొన్ని శాంపిల్స్‌ను తీసుకున్నారు. తదుపరి చర్యల కోసం జేసీకి నివేదిక అందజేస్తామని ఈశ్వరి తెలిపారు. ఆమె వెంట ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీ, సిబ్బంది ధనుంజయరావు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని మరిన్ని హోటళ్లు తనిఖీ చేస్తే నిర్వాహకుల బాగోతం బయటపడేది. అలా చేయకుండా ఫిర్యాదు వచ్చిన మేరకే తనిఖీ చేసి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.

## హోటళ్లలో గృహ సిలిండర్ల వాడకం..

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో యదేచ్ఛగా గృహ సిలిండర్లను వినియోగిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సైతం వారికి గృహ సిలిండర్లను వాణిజ్య సముదాయాలకు హోటల్స్‌కు, డాబాలకు సప్లై చేస్తున్నారు. పట్టించుకోవలసిన సివిల్ సప్లై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల గృహ సిలిండర్లు దుర్వినియోగం అవుతున్నాయి.



### కోరిన కోర్కెలు తీర్చే
# కిల్లమ్మతల్లి

* పిడిమందస నుంచి మందసకు రాక
* రాజావారి కోటలో 16 రోజులు ప్రత్యేక పూజలు



**మందస, సెప్టెంబరు 15(వార్త):**కోరిన కోర్కెలు తీర్చే కిల్లమ్మతల్లిని సంప్రదాయబద్ధంగా మందస పట్టణానికి తీసుకువచ్చారు. రాజుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలను పాటిస్తూ పిడిమందస గ్రామంలోని ఆలయం నుంచి మందస పట్టణంలోని రాజుగారి కోటకు ప్రతీ ఏటా తీసుకువస్తారు. 16రోజుల పాటు మందసలోనే కిల్లమ్మతల్లి అమ్మవారు ఉంచి, పూజలు నిర్వహిస్తారు. మందస సంస్థానాన్ని పాలించిన రాజుల, జమీందారుల ఆరాధ్య దైవమైన కిల్లమ్మ దేవతకు అంగరంగ వైభవంగా మేళతాళాల మధ్య మందస రాజావారి కోట ప్రాంగణానికి తీసుకువచ్చారు. కిల్లమ్మతల్లి దేవత ఆలయం అర్చకులు, భక్తులు ఉత్సాహంగా ఊరేగించి ప్రత్యేక పూజలు చేసి పిడిమందస గ్రామంలోని కిల్లమ్మ దేవత ఆలయం నుంచి మందస గ్రామానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సోమవారం నుంచి మందసలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కిల్లమ్మ దేవతను మందస తీసుకువచ్చిన రోజు అనగా పిడిమందస గ్రామంలో సోమవారం దసరా పండుగలు ప్రజలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తోంది.

### యూరియా కోసం..
# పడిగాపులు

* గంటల కొద్దీ రైతుసేవా కేంద్రాల వద్ద రైతులు ఎదురుచూపులు
* సరైన సమాచారం ఇవ్వని వ్యవసాయాధికారులు
* నిలదీస్తున్న అన్నదాతలు
* అధిక ధరకు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు



**పలాస, సెప్టెంబర్ 15 (వార్త):** యూరియా కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ప్రతి రోజూ యూరియా వచ్చిందా.. అంటూ రైతు భరోసా కేంద్రం, రైతు సేవా కేంద్రం చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులకు యూరియా అవసరం చాలా ఉంటుంది. ఇలాంటి సమయంలో యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచడం లేదంటూ రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయ పనులు వదిలేసి మీ చుట్టే తిరగాలా అంటూ ఆగ్రహం, అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రైతులు పలాస మండలం చినంచల పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చి యూరియా ఎప్పుడొస్తుందంటూ వ్యవసాయ అధికారులను నిలదీశారు. ఒక్కో రైతు ఒక ఎకరం నుంచి పది ఎకరాల వరకు సాగుచేస్తున్న పరిస్థితుల్లో రెండు బస్తాలు ఎలా సరిపోతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని రైతులు వాపోతున్నారు. గత పదేళ్లలో యూరియా కోసం ఇంతగా ఇబ్బందులు పడిన దాఖాలాలు లేవని, కూటమి ప్రభుత్వం వచ్చాకే రైతులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తగిన మొత్తంలో యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, మూడు నాలుగు రోజులగా యూరియా కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా యూరియా దొరకడం లేదని, పంటలకు యూరియా లేకపోతే దిగుబడి ఎలా వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొత్త కంపెనీలకు చెందిన యూరియా బస్తాలు దుకాణాల్లో కనిపిస్తున్నాయని, ఒక్కో బస్తా రూ.500 నుండి 1000 వరకు విక్రయిస్తున్నారని, సొసైటీలు, గ్రోమోర్ కేంద్రంలో స్టాకు లేదంటున్నారు. యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇచ్ఛాపురం బెల్లుపడ ఆర్ఎస్‌కే కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం పడి గాపులు కాశారు. సోమవారం ఉదయం 8గంటలకే కేంద్రం వద్దకు రైతులు చేరుకున్నా 11 గంటల వరకు సిబ్బంది రాకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. అధికారులు వచ్చి రైతులకు కూపన్లు అందజేశారు. రెండు రోజుల్లో యూరియా వస్తుందని, కూపన్లు తీసుకొస్తే యూరియా అందిస్తామని చెప్పారు. దీంతో రైతులు ఉసూరమంటు వెనుదిరిగారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అన్నదానానికి భారీగా తరలివచ్చిన ప్రజలు



**వీరఘట్టం, సెప్టెంబరు 15(వార్త):** వీరఘట్టంలోని చాకల వీధి వారి సౌజన్యంతో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని దీన్ని గ్రహించిన చాకలి వీధి ప్రజలు ఎంతో ధన్యులని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తూముల రమేష్, జంపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్‌పోర్ట్ పేరిట కార్పొరేట్‌కు ప్రజల ఆస్తులు

**-కేంద్రమంత్రి మౌనం వీడి,**

**ప్రజలకు సమాధానం చెప్పాలి**

**-బహడపల్లిలో ప్రజా సంఘాల డిమాండ్**




**మందస, సెప్టెంబరు 15(వార్త):** కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీ ఆస్తులుగా ఎందుకు మార్చడానికి పూనుకుంటున్నారో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్‌రావు, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. బహడపల్లిలో బలవంతపు భూసేకరణ ఆపాలని కార్గో ఎయిర్పోర్ట్ రద్దు చేయాలని కోరుతూ కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ కేంద్ర మంత్రి కార్పొరేట్ కంపెనీల పక్షాన ఉంటారా.. ప్రజల పక్షాన ఉంటారా.. అని వారు ప్రశ్నించారు. కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో దోపిడీకి పాల్పడితే ప్రజలు ప్రతిఘటన తప్పదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలోనే అతి పెద్ద ఎయిర్పోర్ట్ అయిన ఢిల్లీకి 150ఎకరాలు మాత్రమే ఉందని, ఇక్కడ కార్గో ఎయిర్పోర్ట్ కి 1400 ఎకరాలు అని చెపుతున్నప్పటికీ సుమారు మూడు వేల ఎకరాలు కొండలతో సహా ఎవరు ప్రయోజనాల కోసం కేటాయిస్తున్నారని వారు ప్రశ్నించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు ఇస్తే సంవత్సరానికి 13వేల కోట్ల రూపాయలు ప్రజలకు ఆదాయం వస్తుందని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి వ్యవసాయ ఆధార పరిశ్రమలు వస్తాయని, ఉపాధి దొరుకుతుందని వారన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలకి మోసగించడం సరికాదని అన్నారు. కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదన వెంటనే రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని కేంద్ర పౌరవిమానయ శాఖ మంత్రిని వారు డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, జీడిరైతు సంఘం జిల్లా కన్వీ నర్ తెప్పల అజయ్‌కుమార్, కె.బాలాజీరావు, పోతన పల్లి కుసుమ, పొట్టి ధర్మారావు(సర్పంచ్), హేమారావుచౌదరి, సాలిన జగన్ నాయకులు, మామిడి మల్లేష్, మామిడి తులసయ్య, మామిడి కృష్ణారావు, మామిడి మాధవరావు, అందాల మనమ్మ, సాలిన సావిత్రమ్మ, యం.తులసయ్య, దున్న రామారావు, గణపతి, కె.రమేష్(రైతు కూలీ సంఘం), నల్ల పరుశురాం, జి.బాలకృష్ణ, దాసరి మోహన్ పాల్గొన్నారు.

# డ్రాగన్ ఫ్రూట్స్‌తో ఆదాయం



**మందస, సెప్టెంబరు 15(వార్త):** డ్రాగన్ ఫ్రూట్స్ పంటను సాగు చేస్తే ఆదాయం, ఔషధ గుణాలు కూడా కలుగుతాయని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస మండల పరిధిలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి మహిళా రైతు సంఘాలలో కొంతమంది సభ్యులు కుటుంబ సభ్యుల సహకారంతో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా అధిక ఆదాయంతో పాటు ఔషధ గుణాలు కలిగి ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్ ను ఆర్గానిక్ పద్ధతిలో సహజ సిద్ధంగా పండించి మార్కెట్ చేస్తున్నారు. బహడపల్లిలో మహిళలు చేపట్టిన రొట్టెల బేకరీ, క్యాజు తయారీ మొదలగు ఎంటర్ప్రైనేర్ యాక్టివిటీస్ ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివ సాయి సంఘం నుంచి కర్రి పాపమ్మ అనే మహిళా రైతు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్గానిక్ విధానంలో పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలించి, ఎలాంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా, సహజ సిద్ధమైన కంపోస్టు ఎరువుతో పండించడాన్ని చూసి ఆనందం వ్యక్తపరిచారు. ఎలాంటి చీడపీడల బెడద లేకుండా గోమూత్రం, బెల్లంతో తయారుచేసిన మిశ్రమాన్ని వినియోగించి అధిక ప్రయోజనం పొందుతున్నట్లు వివరించారు. ఈ పండ్లు కిలో 250నుంచి 300 రూపాయల వరకు స్థానిక మార్కెట్ తో పాటు పండించిన రైతుకు ఫోన్ ద్వారా కూడా ఆర్డర్లు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు మంగమ్మ, ముఖలింగం, ఆర్గానిక్ రైతు కర్రి ధర్మారావుతో పాటు వీవోఏ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు గాయత్రి స్కూల్ విద్యార్థి

**వీరఘట్టం, సెప్టెంబరు 15(వార్త):** వీరఘట్టంలోని గాయత్రి స్కూల్ లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కుశల్ విన్స్ అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ లోకేష్ తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన స్టేట్ సెలక్షన్స్‌లో జూనియర్ అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడన్నారు. తమ పాఠశాల విద్యార్థి జిల్లా తరపున ఎంపిక కావడం ఎంతో గర్వకారణం అని, తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రత్యేక తర్ఫీదును ఇస్తున్నామన్నారు. కుశల్ విన్స్‌ను కరస్పాండెంట్ లోకేష్‌తో పాటు విద్యార్థి తల్లి తండ్రులు కృష్ణారావు, సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాచలం, పీఈటీ రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.




# మందసలో పర్యటించిన మాజీ మంత్రి అప్పలరాజు



**మందస, సెప్టెంబరు 15(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మందస మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కుటుంబాలను పరామర్శించారు. సాబకోట ఎంపీటీసీ సవర కాంచన(చీపి నారాయణపురం) కుమారుడు రాజేంద్ర ఇటీవల ప్రమాదంలో మరణించారు. తాళ్లగురంటి పంచాయతీలోని గౌడుగురంటి గ్రామానికి చెందిన నల్ల రమేష్ కుమార్ కిడ్నీవ్యాధితో మృతి చెందారు. ఆయా కుటుంబాలను పరామర్శించి, ఓదార్చి సంతాపం తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరారు. అంతకు ముందు పిడిమందసలో గల శ్రీకిల్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. డాక్టర్ అప్పలరాజుతో పాటు మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అగ్గున్న సూర్యారావు, మండల అధ్యక్షుడు దల్లి జానకిరావురెడ్డి, మండల యువజన అధ్యక్షుడు శానాపతి కిషోర్ కుమార్, చింతాడ గణపతి, బాడ జగన్నాయకులు, సవర కామేసు, గుంపు జగదీష్, లోకనాథ్ చౌదరి, నల్ల భాస్కరరావు, గున్న రమణ, తమిరి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## చెత్త సంపద కేంద్రానికి ఊపిరి

**-జాతీయ వార్త కథనానికి స్పందన**

**జి.సిగడాం, సెప్టెంబరు 15(వార్త):** జగన్నాథవలస గ్రామంలో ఇటీవల ఈ నెల 13న మూలకు చేరిన చెత్త సంపద కేంద్రం అనే శీర్షికన జాతీయ వార్త దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ థనంపై ఎంపీడీవో జి.రామకృష్ణ స్పందిస్తూ పంచాయితీ కార్యదర్శికు అదే శాలుజారీ చేశారు. ఆ వెంటనే పంచాయతీ కార్యదర్శి చెత్త సంపద కేంద్రాన్ని బాగు చేశారు.

## ఫీల్డ్‌అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం



**మెళియాపుట్టి, సెప్టెంబరు 15(వార్త):** ముక్తాపురం క్షేత్ర సహాయకుడు సవరరాజు (35) మృతి చెందడంతో ఆయన కుటుంబానికి భరోసాగా నిలిచారు తోటి ఫీల్డ్ అసిస్టెంట్లు. ఆయన భార్య స్వర్ణకుమారికి రూ.10 వేల ఆర్థిక సహాయం వారు అందించారు.రాజు అనారోగ్య సమయంలో సైతం మాకు తోచిన సహాయాన్ని ఇటీవల కాలం సహకారం అందించా మన్నారు. అతి తక్కువ వయసులో చిన్న వయస్సులోనే రాజు అనారోగ్యానికి గురై మృతి చెందటం బాధాకరమన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ కూడా స్వర్ణకుమారికి అండగా ఉంటామని క్షేత్ర సహాయకులు తిరుపతిరావు, సింహాచలం, చాణిక్య, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఒడియా గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(వార్త):** స్థానిక రత్తకన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లో ఒడియా గెస్ట్ లెక్చరర్ పోస్ట్ కు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు చెప్పారు. ఈ నెల 20 లోగా దరఖాస్తు చేసుకుంటే 22 న ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు. ఒడియా సబ్జెక్టులో 55 శాతం మార్కుల తో పి.జితో పాటు నెట్, పిహెచ్‌డికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు.

## జిల్లా స్థాయి పోటీలకు ధరణి ఎంపిక



**పలాస, సెప్టెంబరు 15(వార్త):** బొడ్డపాడు గ్రామంలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలాస నియోజకవర్గస్థాయ సోమవారం అండర్ 14 విభాగంలో కబడ్డీ పోటీలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ చదువుతున్నటువంటి ఎం ధరణి అసాధారణ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా చక్కటి ప్రతిభ కనబర్చిన విద్యార్థి ధరణికి, కోచ్ లు కిరణ్, గుర్నాద్ లకు, ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరావు, ఉప అధ్యక్షులు తాళాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

## జిల్లా వైశ్యసంఘ ప్రధాన కార్యదర్శిగా వెంకటరావు



**నరసన్నపేట, సెప్టెంబరు 15(వార్త):** జిల్లా కళింగ వైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా జామి వెంకటరావు ఎన్నికయ్యారు. ఇటీవల నరసన్నపేటలో జిల్లా సంఘం తరపున జరిగిన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం రాష్ట్ర కళింగ వైశ్య సంఘ అధ్యక్షుడు బోయిన గోవింద రాజులు కార్యవర్గాన్ని ప్రకటించారు. తనను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు వెంకటరావు తెలిపారు.

## టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

**పలాస, సెప్టెంబరు 15(వార్త):** టిడ్కో ఇండ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తామని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు హామీ ఇచ్చారు. సోమవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో 13 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## 17 నుంచి వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

**-పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి**

**వీరఘట్టం, సెప్టెంబరు 15(వార్త):** వాహనమిత్ర పథకానికి ఈ నెల 17నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తారని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అక్టోబరు 1న వాహనమిత్ర ప్రారంభం కానుందని, ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. సొంత ఆటో కలిగిన డ్రైవరకు వాహన మిత్ర వర్తిస్తుందన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. ఫిట్‌నెస్ వంటి సర్టిఫికెటు ఉండాలి. ఆటో రిక్షా విషయంలో ఫిట్నెస్ సర్టిఫికేట్ లేకపోయినా 2025-26 సం.రంకు అనుమతిస్తారు. అయితే ఒక నెలలోపు ఆ సర్టిఫికేట్ ను పొందాల్సి ఉంటుంది. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉండాలి/రేషన్ కార్డు కలిగి ఉండాలి. విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల కంటే తక్కువగా ఉండాలి.





## జిల్లాస్థాయి చెస్ పోటీలకు నడుమూరు విద్యార్థిని

**మందస, సెప్టెంబరు 15(వార్త):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న డివిజన్ స్థాయిలో జరిగిన ఎంపికల్లో నడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాధవి సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు చక్రధరరావు తెలిపారు. అండర్ 17విభాగాల్లో చెస్ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థిని మాధవి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాబురావు తెలిపారు. శ్రీకాకుళం వేదికగా ఈ నెలలో జరిగే పోటీలకు పలాస తరుపున పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది, గ్రామ ప్రజలు ఎంపికైన విద్యార్థిని మాధవిని అభినందించారు.

## దాసరి తాతారావుకు సన్మానం



**మందస, సెప్టెంబరు 15(వార్త):** ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతులు కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన దాసరి తాతారావుకు ఘనంగా తెలుగు దేశం పార్టీ నాయకులు సన్మానించారు. అంబుగాం పంచాయతీ, లింబుగాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, యూనిట్ కన్వీనర్ మండల లచ్చయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గొల్లలపాలెం వెళ్ళి, తాతారావు, జయలక్ష్మి దంపతులను స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్దానం నుంచి రాష్ట్ర పదవి దక్కించుకున్న తాతారావు అభినందనీయుడన్నారు. కార్యక్రమంలో తలగన రాజశేఖర్, బదకల రేఖారావు, పులారి వీరాస్వామి, బధకల లక్ష్మీనారాయణ, నర్తు ఈశ్వరరావు, పూలరి అప్పలస్వామి, అడ్డి దండాశి, సాలిన లచ్చయ్య, నర్తు వల్లయ్య, పులారి లచ్చయ్య, మండల రమేష్, సార భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ ద్వారా దశపర్ని కషాయం పిచికారి




**వీరఘట్టం, సెప్టెంబరు 15(వార్త):** చలివేంద్రి గ్రామంలో డ్రోన్ పరికరం ద్వారా దశపర్ని కషాయాన్ని పిచికారి చేయించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని కందల రామకృష్ణ, కోడూరి శంకరరావు , నెల్లి రామారావుకు చెందిన పొలాలలో డ్రోన్ ద్వారా దశపర్ణి కషాయం పిచికారి చేయడం జరిగింది ఆమె తెలిపారు వ్యవసాయ శాఖ ద్వారా డ్రోన్ ని సబ్సిడీ పై ఎఫ్ పి ఓ వీరఘట్టం కు సరఫరా చేశామన్నారు. రూ.9,80,000ల విలువ గలిగిన డ్రోన్ ను 80 శాతం సబ్సిడీ ద్వారా రైతులకు అందజశామన్నారు. గత నెలలో వీరఘట్టం మండలానికి వచ్చిన డ్రోన్ ను సద్విని యోగం చేసుకుంటూ నానో యూరియా, ప్రకృతి వ్యవసాయంలో కషాయాలను పిచికారి చేసుకోవడానికి వాడుతున్నట్లు ఆమె తెలిపారు. చలివేంద్రి గ్రామంలో 10 ఎకరాల పొలాలకు పిచికారి చేయడం జరిగిందని ఆమె వివరించారు

## కొత్తపల్లిలో జాతీయ హిందీ దినోత్సవం

**మందస, సెప్టెంబరు 15(వార్త):** కొత్తపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో కార్యక్రమాన్ని సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అదే విధంగా స్థానిక హిందీ ఉపాధ్యాయిని బేపల పాపమ్మకు దుశ్శాలువతో ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది సత్కరించారు. ఉపాధ్యాయులు హిందీ భాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ వక్తృత్వ, వ్యాసరచనలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు గణేశ్వరరావు, భీమారావు, జానకమ్మ, లక్ష్మణరావు, అప్పారావు, చిత్రసేను, దామోదరం, గోపాలకృష్ణ, హారిక తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంట్లో వ్యాపారవేత్త తయారీ చంద్రబాబు లక్ష్యం

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**నరసన్నపేట, సెప్టెంబరు 15(వార్త):** నరసన్నపేట పద్మావతి డిగ్రీ కళాశాలలో ఎం.ఎస్.ఎం ఈ ర్యాంపు ప్రోగ్రాం ప్రారంభోత్సవలో ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్త తయారుచేయడమే లక్ష్యంగా కళాశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నందుకు సంతోషిస్తున్నా మన్నారు. కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యువత వారి ఆలోచన విధానాన్ని మార్చుకొని, పారిశ్రామికవేత్తలుగా పరిశ్రమలను, కంపెనీలను స్థాపించడానికి నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ఈ శిక్షణను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. త్రెడ్స్ ఐటీ ప్రతినిధి, జిల్లా ఇన్చార్జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ యువత, మహిళలు ప్రతి ఒక్కరు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్లి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారికి మెటీరియల్ అందజేశారు.




కార్యక్రమంలో ఎం శ్రీని వాసరావు, ప్రిన్సిపాల్ వీ.అప్పలనాయుడు, రిటైర్డ్ టీచర్ కే.రామారావు, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వాగోటి రామచంద్రరావు, మేనేజ్మెంట్ సభ్యుడు కే.ఎ రాజు, పవన్, గౌతమ్ త్రెడ్స్ ఐటీ సిబ్బంది, విద్యార్థిని విద్యా ర్థులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల రక్షణకు యూటీఎఫ్ రణభేరి



**-బోధన కోసం మాత్రమే ఉపాధ్యాయులను వినియోగించాలి**

**-రణభేరి అడ్డుకున్న కాశీబుగ్గ పోలీసులు**

**-ఉద్రిక్తల నడుమ యూటీఎఫ్ నాయకుల్ని అరెస్టు చేసిన పోలీసులు**

**పలాస, సెప్టెంబరు 15(వార్త):** ప్రభుత్వ పాఠశాల రక్షణ కోసం ,విద్యార్థుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రణభేరి కార్యక్రమం జరుగుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పలాస బస్టాండ్ దగ్గర వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా సాల్ట్ పథకాన్ని విద్యారంగంలో తీసుకువచ్చి పాఠశాల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేసిందని, అదే పథకాన్ని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందని విమర్శించారు. పిల్లలకు నాణ్యమైన విద్య ఒక అక్షరం కూడా చెప్పే అవకాశం ఈ ప్రభుత్వం ఇవ్వటం లేదని విమర్శించారు. ప్రపంచ బ్యాంకుకు గణాంకాలు ఇవ్వడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య వస్తుందా అని సూటిగా ప్రశ్నించారు. విద్యా శక్తి కార్యక్రమం ఇప్పుడు పిల్లలు అక్షరాలు నేర్పడం కాకుండా ఆన్లైన్ లో అప్లోడ్ చేయటంగా మారిపోయిందని విమర్శించారు. బోధనకు మాత్రమే పరిమితం చేయాల్సిన ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలు చుట్టూ తిప్పుతూ ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలు బయటికి వెళ్ళటానికి కారణం ప్రభుత్వం, ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు అని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా బోధన కోసం మాత్రమే ఉపాధ్యాయులను ఉపయోగించాలని బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని, సెల్ ఫోను లేని పాఠశాల ఉండాలని డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణంలో ర్యాలీ చేస్తున్నటువంటి నాయకత్వాన్ని పలాస కేంద్రంలో అరెస్టు చేయటానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం, ఖండిస్తున్నామని చెప్పారు. ప్రశ్నించే హక్కు కూడా లేకపోవటం సరికాదని రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి అందర్నీ అరెస్టు చేసి ఒక రెండు గంటలపాటు యాత్రకు విఘాతం కలిగించటంను తీవ్రంగా ఆక్షేపించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్. మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు, రాష్ట్ర నేతలు కార్యవర్గ సభ్యులు గుంట కోదండరావు, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ ఎల్ వెంకటాచలం, పలాస మండల అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినాన జయరాం, ఎస్వీ రమణ, కరజాడ ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు టీ వీ రమణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బాలి జాతరకు విరాళాలు స్వీకరించం : రాజశేఖర్

**జలుమూరు, సెప్టెంబరు 15(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖ లింగంలో నవంబర్5 బుధవారం కార్తీక పౌర్ణమి రోజు నిర్వహించే బాలి జాతరకు ఎలాంటి విరాళాలు స్వీకరించబడవు. రాష్ట్ర నలుమూలల నుండి వస్తున్న భక్తులు ఈ విషయాన్ని గమనించగలరు. ఇటీవల కొందరు దళారులు టీముగా బాలియాత్ర కు విరాళాలు ఇవ్వండి అని కలెక్షన్ చేస్తున్నారు .అది మా ఆలయ ప్రధాన అర్చకుల దృష్టికి వచ్చింది. కాబట్టి ఒకవేళ ఎవరైనా ఇవ్వాలనుకుంటే నగదు రూపంలో కాకుండా వస్తు రూపంలో మాత్రమే జాతర నిర్వహించే రోజు ఆలయ ప్రాంగణంలో ఈవో- ప్రధాన అర్చకుల మధ్య ఇవ్వవలెను. అది కూడా వాటర్ ప్యాకెట్స్ గాని మందు గుండు సామాగ్రి కి గాని టెంట్లు కుర్చీలు కొరకు గానీ దాతలు ఇవ్వవచ్చు .కార్తీకమాసం సందర్భంగా ప్రతి ఏటా జలుమూరు ఎంపీడీవో మరియు స్థానిక పంచాయతీ సిబ్బంది పంచాయతీ నిధులతో రేవులు బాగు చేయడం, ఆలయం నుండి రేవుల మధ్య లైటింగ్ ఏర్పాటు చేయడం, శానిటేషన్ మొదలగువని పూర్తి చేస్తారు. వీటికి వారు బిల్లులు పెట్టుకుంటారు .అది భక్తులు గమనించవలసింది .దీనికి కమిటీ సభ్యులు ఉండరు .దేశవ్యాప్తంగా ఉన్న భక్తులందరూ బాలి జాతర నిర్వహణ సభ్యులు ఇటీవల బాలి జాతర నిర్వహణ కమిటీ అని అబద్ధాలు చెప్పి కొంతమంది విరాళాలు గ్రూపుగా కొన్ని ప్రాంతాలకు వెళ్లి వసూలు చేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసమని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలి. వంశధార నది ఒడ్డున ఆరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి ఉచితముగా అరటి తెప్పలు మరియు నూనెతో కూడిన వత్తులు ఉచితంగా ఇవ్వబడును. ఈ మేరకు




ఆదివారం శ్రీకాకుళం ఎన్జీవోహంలో పత్రిక సమావేశం నిర్వహించామని శ్రీముఖలింగేశ్వర ఆలయ ప్రధానఅర్చకులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు.

# మ్యాజిక్ డ్రైన్స్ పనులను పరిశీలించిన ఎంపీడీఓ



**జి.సిగడాం, సెప్టెంబరు 15(వార్త):** మెట్టవలస గ్రామంలో సర్పంచ్ కామోజుల అరుద్ర, ఎంపీటీసీ బెవర లక్ష్మీ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మ్యాజిక్ డ్రైన్ పనులను పనులను సోమవారం మండల అదికారులు ఎంపీడీఓ జి.రామకృష్ణ, ఎపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదేల పురుషోత్తం పరిశీలించారు. మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణంతో గ్రామంలో పారిశుధ్యం మెరుగవు తుందని జి.సిగడాం పీఏసీఎస్ అద్యక్షుడు బెవర జగన్నాధరావు, సర్పంచ్ ప్రతినిధి కామోజుల సీతారాం తెలిపారు.ఈ సందర్బంగా అదికారులు మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపొందించడానికి జిల్లాలో మోడల్ మ్యాజిక్ డ్రైన్లకు నాలుగు మండలాల నుండి నాలుగు మోడల్ గ్రామాలను చేయడం జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధికి సూమారు రూ.3లక్షల 50 వేల రూ. ప్రత్యేక నిధులను కేటాయించడం జరిగిందన్నారు.మ్యాజిక్ డ్రైన్ వలన భూమిలోనికి నీరు ఇంకిపోతుంది అన్నారు. దాని వలన భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యత పెరుగుతుందని చెప్పారు. అతి తక్కువ ఖర్చుతో ఇళ్ల వద్ద మురుగు సమస్యలు లేకుండా చేసుకోవచ్చునని అన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జెసిఐ ఆధ్వర్యంలో హ్యూమన్ డ్యూటీస్ డే

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(వార్త):** జెసిఐ ఆధ్వర్యంలో హ్యూమన్ డ్యూటీస్ డే అవగాహన, అంతర్జాతీయ మానవ కర్తవ్య దినోత్సవ పిటిషన్ సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా యువత స్వరాలతో రిల్స్, పోస్టర్లు రూపొందించి ప్రజల్లో కర్తవ్యాలపై అవగాహన కల్పించారు. జులై 10న ఇంటర్నేషనల్ హ్యూమన్ డ్యూటీస్ డే కింద ప్రకటించాలని పిటేషన్‌లో పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కాళ్ల జయ్ దేవ్ యాదవ్ సభ్యులు టీ షణ్ముఖ్, వెచ్చా వాసవి, మోహన్ వెంకటేష్, శిరీష, మట్టా శ్రీనివాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం రద్దు అన్యాయం

**- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**శ్రీకాకుళం, సెప్టెంబరు 15(వార్త):** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించిన పథకాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి, వారికి కూడా అధిక విద్యుత్ బిల్లులు వేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. "గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తూ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసింది. అందులో ఒక ముఖ్యమైన పథకం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం. దీనివల్ల వేలాది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరట లభించింది. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని రద్దు చేసి, నిరుపేద కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారాన్ని మోపడం అత్యంత అన్యాయం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల వారికున్న చిత్తశుద్ధి లేమిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించి, ప్రజల సంక్షేమానికి వ్యతిరేకంగా పనిచేస్తోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, పైగా తగ్గిస్తామని చంద్రబాబు కూటమి హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చాక ప్రజలకు వరుసగా విద్యుత్ షాక్‌లు ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకూ ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను రద్దు చేసి, వారికి కూడా అధిక బిల్లులు వేస్తోందని అన్నారు. వాడిన కరెంటుకు, వస్తున్న బిల్లులకు ఏమాత్రం పొంతన లేకపోవడంతో ప్రజలు లబోదిబోమంటున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కరెంటు బిల్లులు కట్టాల్సిన అవసరం రాలేదని, ఇప్పుడు బిల్లులు మోత మోగిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అదనపు ఛార్జీలు ఎక్కువ బిల్లు వచ్చే వారిపై కాకుండా, తక్కువ బిల్లు వచ్చే పేదలపైనా విధించడం వల్ల వారిపై మరింత భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదలకు ఉచితంగా విద్యుత్ ఇస్తామని చెప్పి, అదనపు ఛార్జీల భారం మోపడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై ఆలోచించి పేదలపై బిల్లుల భారాన్ని తగ్గించాలని, ఉచిత విద్యుత్ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.






## కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం రూ.4.91 లక్షలు

**కోటబొమ్మాళి, సెప్టెంబరు 15(వార్త):** స్థానిక శ్రీకొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల ధర్మహుండీలు 85 రోజులకుగాను లెక్కించగా రూ. 4,91,802లు ఆదాయం వచ్చిందని కొత్తమ్మతల్లి ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకిష్ణ సోమవారం తెలిపారు. రాయివలస ఈవో జి.గురునాధరావు ఆద్వర్యంలో ఈ హుండీల లెక్కింపు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటి చైర్మన్ కోరాడ చిన్నగోవింద్, గ్రామ పెద్దలు కోరాడ పెద్ద గోవింద్, కమిటి సభ్యులు, దేవాదాయ సిబ్బంది, యూనియన్‌బ్యాంక్ సిబ్బంది, స్థానిక పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 231 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**కోటబొమ్మాళి, సెప్టెంబరు 15(వార్త):** నిమ్మాడ, నారాయణవలస తదితర గ్రామాల్లో గల 231 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సోమవారం పశువైద్యాధికారులు డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంకు 12.100 గాలికుంటు నివారణ టీకాలు వచ్చాయని తెలిపారు. అలాగే గాలికుంటు వ్యాధి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే తీసుకోవాల్సి నివారణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సిబ్బంది కె. అనంతరావు, రాంబాబు, శంకర్, భాస్కరరావు, ఫణి, ప్రసాద్, రామక్రిష్ణ, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దివస్ వేడుకలు




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(వార్త):** శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో హిందీ దివస్ వేడుకలు స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన జరిగాయి. హిందీ దివస్ సందర్భంగా హిందీ ఉపాధ్యాయురాలు శాంతి మహాపాత్రో కీ స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి సాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కే సి పూరి ఉపాధ్యాయులు సురేఖ, శంకర్, రవి జయలక్ష్మి, పార్వతి, ప్రమీల ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి యస్. పి. యల్స్. జిహారిక, యువ శ్రీ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోలిగాం, ఆవరణలో హిందీ దినోత్సవం సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు నరేంద్ర నాథ్ పట్నాయక్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల కుమారి, ఉపాధ్యాయులు జ్యోతి, నిలీప్, పాపారావు, శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, ధర్మరాజు, రామ్మోహన్ రావు,అమిత, కోటేశ్వర రావు, బర్ష ప్రధాన్ లు పాల్గొని ఉపాధ్యాయుల సేవలను కొనియాడి సన్మానించారు. దొంకూరు లో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. హిందీ అద్యక్షులు పాఠశాల హెచ్. ఎమ్. జి. హేమకుమారి, ఉపాధ్యాక్షులు సి. హెచ్. వెంకట రమణ, డి. పద్మావతి. వివిద సాంస్కృతిక కళా నృత్యాలు విద్యార్థులు చే ప్రదర్శన చేసారు. ఈదుపురం స్కూల్లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవానికి తరలి రండి



**నరసన్నపేట, సెప్టెంబరు 15(వార్త):** విశ్వకర్మ జయంతి సందర్భంగా యజ్ఞోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలిరావాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి చింతు పాపారావు పిలుపునిచ్చారు. సోమవారం నరసన్నపేటలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న యజ్ఞోత్సవ భూమి పూజ కార్యక్రమం ఉద్దండరాయపాలెం అమరావతిలో నిర్వహిస్తున్న సందర్భంగా పంచ వృత్తుల వారు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా శాఖ ఇప్పటికే తగిన సమాచారాన్ని అందించడం జరిగిందన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

**పలాస, సెప్టెంబరు 15(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 2వ వార్డు కోసంగిపురంకు చెందిన కింతల మురళీమోహన్ లాయర్ మాతృమూర్తి కింతల కృష్ణవేణమ్మ ఇటీవల మరణించారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కింతల.కృష్ణవేణమ్మ చిత్రపటానికి మాజీ మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షులు శిష్టు.గోపీ, పలాస మాజీ ఎంపీపీ బత్తిని.హెమేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ సనపల.సింహాచలం, వైస్సార్సీపీ జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి. దుర్యోధనరావు, పలాస నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాయలపల్లి. శ్రీనివాసరావు, వైస్సార్సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బిరాటి.వల్లభరావు, బోనెల.రవి, స్థానిక పెద్దలు కింతల.శివయ్య మాస్టర్, కింతల.రాము, వారి కుటుంబసభ్యులు కింతల.రాంబాబు, కిషోర్ లు పాల్గొన్నారు.




## పారిశుధ్య సమస్యకి శాశ్వత పరిష్కారం చూపండి

**జలుమూరు, సెప్టెంబరు 15(వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన క్షేత్రంలో 10 ఏళ్ల ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్య పై శాశ్వత పరిష్కారం చూసేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని గ్రీవెన్స్‌లో ఆలయ అనువంశిక అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ కోరారు.



## సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వండి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15(వార్త):** జిల్లాలో పశు సంవర్ధక సహాయకులు కు ఇతర శాఖాపరమైన విధులు నుంచి మినహాయింపు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు టి.అయ్యప్ప జేడీను కోరారు. సర్వేల వలన మాతృ శాఖ విధులు నిర్వర్తించలేకపోతున్నాము అని, సకాలంలో టీకాలు మరియు పశు వైద్య సేవలకు అంతరాయం కలుగుతుంది అని తెలిపారు. రెండు శాఖల నుంచి వస్తున్న తీవ్ర పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.



## మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



**పలాస, సెప్టెంబరు 15(వార్త):** మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ అన్నారు. సోమవారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ పలాస డివిజన్ స్థాయి సెలక్షన్లు నందిగామ నుండి ఇచ్ఛాపురం వరకు మండల స్థాయిలో సెలెక్ట్ అయిన విద్యార్థులు బొడ్డపాడు ఉన్నత పాఠశాల యందు కాబడ్డి,చెస్ క్రీడాంశాలలో ఎంపికలు చేపట్టారు. ఈ క్రీడా పోటీలకు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్ 14 విభాగంలో చెస్, కబాడీ బాలబాలికలు 20 మంది చొప్పున, మొత్తం40 మంది, అండర్ 17 విభాగంలో చెస్, కబాడీ పోటీల్లోబాల బాలికలు ఒక్కొక్క విభాగం నుంచి 20 మంది ఎందుకు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశమునకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర్రాజు , ఎస్.ఎం.సి.చైర్మన్ గార్తం తులసీరావ్, కుత్తుం లక్ష్మణరావు, సర్పంచ్ మదన్, మాజీ సర్పంచ్ త్రిలోచన్రావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి. తవిటయ్య, ప్రధానోపాధ్యాయులు హరిబాబ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘబాధ్యులు సిహెచ్ పద్మలోచన , ఎస్ రామారావు, పి గజేంద్రరావు, సెలక్షన్ కమిటీ సభ్యులు ఎస్ రమేష్, ఎస్ లోకేశ్వరరావు, మధు, జే నారాయణ, మున్న, టి గణేష్ హరి గీత పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546